ప్రజాశక్తి

శనివారం 21 సెప్టెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వార్త మెయిన్, టాబ్లాయిడ్ 2లో..



సీతారాం ఏచూరి సంతాప సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై పలు పార్టీల నాయకులు

సీతారాం ఏచూరి స్ఫూర్తితో..

ఉద్యమ శక్తులు ముందుకు సాగాలి

సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పలు పార్టీల నాయకులు

వార్త మెయిన్, టాబ్లాయిడ్ 5లో..



బహిరంగ సభలో అభివాదం చేస్తున్న వి.శ్రీనివాసరావు, లోకనాథం, తదితరులు

మరణశిక్ష జోన్‌లుగా సెజ్‌లు

- అసెన్షియా యాజమాన్యంపై మర్డర్ కేసు నమోదు చేయాలి
- భద్రత పాటించని యాజమాన్యాలను జైలులో పెట్టాలి
- ఫార్మా, సెజ్ కార్మికుల రక్షణ యాత్ర ముగింపు సభలో వి.శ్రీనివాసరావు

పేదల సొంతింటి కలను నెరవేర్చండి

గృహ నిర్మాణ శాఖ ఎమ్‌డి రాజాబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పేదల సొంతింటి కలను నెరవేర్చడంలో భాగస్వామ్యమవుతూ, మంజూరైన ప్రతి ఇల్లునూ అధికారులు దగ్గరుండి కట్టించాలని, గుత్తేదారులకు, లబ్ధిదారులకు సంపూర్ణ సహకారం అందించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎమ్‌డి రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కె.విశ్వనాథన్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం మిగతా 2లో..



సమావేశంలో పాల్గొన్న రాజాబాబు, హరేంధిర ప్రసాద్



గవర్నర్‌కు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రెండు రోజుల విశాఖ పర్యటన శుక్రవారంతో ముగిసింది. ఎయులో గురువారం ఏర్పాటు చేసిన దివ్య కళా మేళా ప్రారంభోత్సవం కోసం ఆయన జిల్లాకు విచ్చేసిన సంగతి తెలిసిందే. పర్యటన ముగియడంతో విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం ఆయనకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.



మొదటి పేజీ తరువాయి..

పేదల సొంతింటి కలను నెరవేర్చండి

మధ్యాహ్నం జివిఎంసి మీటింగు హాలులో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాల ప్రగతిని తెలుసుకున్న ఆయన మరిన్ని ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. సాంకేతిక సమస్యలను అధిగమించి నిర్మాణాల్లో జోరు పెంచాలని, విశాఖపట్నం జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 పథకంలో భాగంగా లబ్ధిపొందిన వారికి మరొక గృహ సంబంధిత పథకంలో అవకాశం రాదని రాజాబాబు స్పష్టం చేశారు. పిఎం ఆవాస్ యోజన 2.0 నేపథ్యంలో కొంతమంది లబ్ధిదారులు పునరాలోచనలో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని గుర్తు చేశారు. దీనిపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయి అధికారులు క్షుణ్ణంగా విడమరిచి చెప్పాలని, ఇప్పుడు మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకునేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను ఒప్పించాలన్నారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు అందరూ చొరవ చూపాలని అన్నారు. పెండింగ్ బిల్లులేమైనా ఉంటే నివేదించాలని, వారం రోజుల్లో పరిష్కరిస్తానని చెప్పారు. మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేసి లబ్ధిదారులను ఉత్సాహంగా భాగస్వామ్యం చేయాలని సూచించారు.

జిల్లాలో జరిగిన ఇళ్ల నిర్మాణాల ప్రగతిని గృహ నిర్మాణ శాఖ ఎమ్‌డికి వివరించిన జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వంద రోజుల ప్రణాళికకు అనుగుణంగా అందరం సమన్వయంతో పని చేస్తామని, ఇళ్ల నిర్మాణాల్లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామని చెప్పారు. లేఅవుట్లలో ఉన్న సాంకేతిక సమస్యలను అధిగమించి ముందుకెళ్లామని, కనీస వసతులను కల్పిస్తూ లబ్ధిదారులకు సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. రోజుకు 80 నుంచి 100 ఇళ్లకు సంబంధించి స్టేజ్ అప్డేషన్ జరగాలని అధికారులకు నిర్దేశించారు. జియో ట్యాగింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, విశాఖ, భీమిలి, పెందుర్తి ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, శేష శైలజ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జివిఎంసి స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి వెల్లడించారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 124 అంశాలతో కూడిన అజెండాను పొందుపరచగా, వాటిని స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప రెండు అంశాలను రద్దు పరిచామని, 35 అంశాలను వాయిదా వేశామని తెలిపారు. మిగిలిన 84 అంశాలను సభ్యులు ఆమోదించారన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.13.18 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి సుమారు రూ.2.26 కోట్ల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. సమావేశంలో జివిఎంసి కార్యదర్శి ఎంవిడి.ఫణిరామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్లు దిలీప్, రత్నాకర్ రెడ్డి, సహాయక వైద్యాధికారులు కిషోర్, కిరణ్ కుమార్, కృష్ణంరాజు, సునీల్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు వంశీ, వెంకటేశ్వరరావు, మాధవరావు, అప్పారావు పాల్గొన్నారు.

విశాఖ పోర్టులో జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుడు పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జి.సునీల్ కుమార్ బాబు, ప్రైవేటు సెక్రటరీ వి.క్రాంతి కుమార్ శుక్రవారం విశాఖపట్నం పోర్టులో పర్యటించారు. పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే వారికి సాదర స్వాగతం పలికారు. కమిషన్ సభ్యుడు రామ్‌చందర్ పోర్టు అధికారులు, ఎస్‌సి ఉద్యోగులు, అధికారుల సంఘం ప్రతినిధులతో కలిసి పరిపాలనా కార్యాలయ ప్రాంగణంలో మొక్క నాటారు. అనంతరం అయన పోర్ట్ ఎస్‌సి ఉద్యోగులు, అధికారుల సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పోర్టు మేనేజ్‌మెంట్‌తో రిజర్వేషన్ విధానం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పోర్టులో ఉన్న మౌలిక సదుపాయాలు, ఎగుమతి, దిగుమతి సౌకర్యాలు, వ్యాపార అవకాశాలు, హరిత చర్యలు, కొనసాగుతున్న ప్రాజెక్టులను అక్కడి అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్‌సి సంక్షేమానికి సిఎస్‌ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తున్నట్టు తెలిపారు. పోర్టు సేవలపై రామ్‌చందర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇగ్నో ఆధ్వర్యాన చిత్ర లేఖన పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వచ్ఛతా హీ సేవా కారక్రమంలో భాగంగా ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యాన లాసన్స్ బే కాలనీలో ఉన్న జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు గోనిపాటి ధర్మారావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

సీతారాం ఏచూరి స్ఫూర్తితో..

ఉద్యమ శక్తులు ముందుకు సాగాలి

సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పలు పార్టీల నాయకులు



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ ఎంవిపి కాలనీ

దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి, చట్టసభల్లో బహు భాషల్లో ప్రసంగాలు చేసి, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు గడించిన కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేత, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమ శక్తులు ముందుకు సాగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. శుక్రవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాప సభ జరిగింది. సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏచూరి సహజ సిద్ధమైన మేధావి అని తెలిపారు. 1970వ దశకం జెఎన్‌యులో చదువుకున్న నాటి నుంచి.. 2024 ఎన్నికల్లో ఇండియా బ్లాక్ ఏర్పాటు చేసినంతవరకూ ఆయన నిర్వహించిన పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. రాష్ట్రంతో ఏచూరికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. కాకినాడకు చెందిన సీతారాం ఏచూరి చిన్నతనం నుంచీ ఎలా ఎదిగారో తెలిపారు. ఆయన మరణం లౌకిక ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. దేశ పరిస్థితులకు అనుగుణంగా కార్మిక, ప్రజా ఉద్యమాలను నిర్మించడం, కొత్త సమాజం కోసం చేసే కృషి మాత్రమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. విశాఖతో ఏచూరికి విడదీయరాని బంధం ఉందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ఉద్యమాల్లో తొలి నుంచీ పాల్గొన్నారన్నారు. విశాఖలో 2015లో జరిగిన సిపిఎం 21వ జాతీయ మహాసభలో ఆయన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన విషయాన్ని గుర్తుచేశారు. సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం కష్టజీవులకు తీరని లోటని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి సలపాలన్నారు. నాడు స్వయంగా ఇందిరా గాంధీని జెఎన్‌యు వీసీగా సీతారాం ఏచూరి రాజీనామా చేయించడం అప్పట్లో ఉద్యమాలకు ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చిందని గుర్తుచేసుకున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్ రెడ్డి పార్లమెంట్‌లో చేసిన కృషిని వివరించారు. వారిరువురూ కమ్యూనిస్టు భావజాలాన్ని ముందుకు నడిపించారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో మరణించే వరకూ ఉద్యమించడం గొప్ప విషయమన్నారు. ఆమ్ ఆద్మీ రాష్ట్ర కన్వీనర్ శీర రమేష్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఎంతో మందికి ఆదర్శమన్నారు. చివరి వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి వెళ్లారన్నారు. సిపిఐ ఎంఎల్ (ప్రజాపోరు) జిల్లా కార్యదర్శి దేవా మాట్లాడుతూ నీతి, నిజాయితీలతో ఏచూరిలా రాజకీయాల్లో కొనసాగడం గొప్ప విషయమన్నారు. ఎస్‌యుసిఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.ప్రమీల మాట్లాడుతూ ఏచూరి ఏ ఆశయం కోసం పోరాడారో దానిని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుధాకర్ మాట్లాడుతూ ఇండియా బ్లాక్ రూపకల్పనకు ఏచూరి కీలక సూచనలు చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు గణేష్ పాండా, ఆర్‌పిఐ (అంబేద్కర్) అఖిల భారత ఉపాధ్యక్షులు బొడ్డు కళ్యాణ్‌రావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, కెఎం.శ్రీనివాస్, బి.జగన్ పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు.

తిరుమల లడ్డు పవిత్రతను గత ప్రభుత్వం దెబ్బతీసింది

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత వైసిపి ప్రభుత్వం తిరుమల లడ్డు పవిత్రతను దెబ్బతీసిందని విశాఖ ఎంపీ ఎం.శ్రీ భరత్ ఆరోపించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమలకు ఆవు నెయ్యిని సరఫరా చేసే నందిని సంస్థను ఎందుకు పక్కకు తప్పించారో గత పాలకులు సమాధానం చెప్పాలన్నారు. తిరుపతి తరహా ఘటనలతో మిగిలిన ఆలయాల్లో కూడా పరీక్షలు జరపాల్సిన పరిస్థితి ఉందన్నారు. నేషనల్ డైరీ రిపోర్ట్ ఆధారంగా ఐదు వేర్వేరు పరీక్షలు చేయగా, లడ్డూల్లో స్వచ్ఛమైన నెయ్యి కాకుండా పామాయిల్, ఇతర నూనెలు వాడినట్లు తేలిందని, ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీసే విషయమని తెలిపారు.

1317వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలేదీక్షలు శుక్రవారం 1317వ రోజుకు చేరాయి. స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టియుసి నాయకత్వంలో వివిధ విభాగాల ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.దీక్షల్లో నాయకులు బి.నాగభూషణం, నీరుకొండ రామచంద్రరావు, బిఎన్.రాజు, జివి.సుబ్బయ్య, కొవిరి అవతారం, సుబ్బారావు, కె.రవి, దుర్గాప్రసాద్, ఎంఎస్ఆర్.ప్రసాద్, ఎం.దేముడు, జి.రాము, ప్రభాకర్‌రెడ్డి, బి.వేణువర్మ, గోపాల్ గంగవరం గోపి, రాజు, పి.పోతారెడ్డి, కొమ్ము ప్రసాద్, బి.గోపాల్, రమణ, నరేంద్రకుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరిలోవ పోలీస్ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలో కొన్ని సమస్యాత్మక పోలీస్‌స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. శుక్రవారం రాత్రి ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, మౌలికవసతులను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, నగరంలో నేరాలు జరిగేందుకు ఎక్కువ ఆస్కారమున్న మూడు పోలీస్‌స్టేషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టామని, వీటిల్లో ఆరిలోవ ఒకటన్నారు. స్టేషన్ పరిధిలో చీకటిగా ఉన్న బహిరంగ ప్రదేశాల్లో నేరాలు జరిగే అవకాశాలున్న దృష్ట్యా జివిఎంసి సహకారంతో ఎక్కడికక్కడ లైట్లు, సిసి కెమెరాలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. రౌడీషీటర్లను నగరం విడిచి వెళ్ళి పోవాలని హెచ్చరించినట్లు తెలిపారు. వరుస నేరాలకు పాల్పడిన వారిపై రౌడీషీట్ తెరుస్తున్నట్లు తెలిపారు. కొత్తగా రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో సిబ్బంది కొరత ఉందన్నారు.

గీతం దూరవిద్య కోర్సుల్లో అడ్మిషన్లు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఒఇ) ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో ఎంఎ ఇంగ్లీష్, బిఎ, బికామ్ డిగ్రీ కోర్సుల్లో 2024 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఒఇ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ 15వ తేదీలోగా అందజేయాలని, పూర్తి సమాచారం కోసం దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం cdl.gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

ఐహెచ్ఆర్‌సి సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- వేపగుంట : నాయుడు తోట, వేపగుంట, పెందుర్తి, గోపాలపట్నం, కంచరపాలెం, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వర్షంలో తడుస్తూ ఇబ్బందులు పడుతున్న 250మంది నిరాశ్రయులకు ఐహెచ్ఆర్‌సి ఆధ్వర్యంలో బిరియానీ ప్యాకెట్లు అందజేసినట్లు సంస్థ జాతీయ ఛైర్మన్ రాజాన ప్రసాదరావు తెలిపారు. సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా బుచ్చిరాజుపాలెం, ఎన్ఎడి జంక్షన్ బస్‌షెల్టర్లలో అవస్థలు పడుతున్న ముగ్గురు నిరాశ్రయులను షెల్టర్‌లో చేర్పించామన్నారు.

మానవ హక్కులపై అవగాహన, పరిరక్షణకు తమ సంస్థ పనిచేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు రవివర్మ కన్వీనర్ బి మురళీ, సెక్రెటరీ ఆర్ రిషిత, ట్రెజరర్ ఆర్ విజయ జాయింట్ ట్రెజరర్ కె.వరలక్ష్మి, రాష్ట్ర సెక్రెటరీ షేక్ షరీఫ్, జిల్లా సభ్యులు వై జగదీష్, సిహెచ్ రాజేష్ ఎస్ లక్ష్మి పాల్గొన్నారు

జివిఎంసి మూడో జోన్ కమిషనర్‌గా శివప్రసాద్

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి మూడవ జోన్ కమిషనర్‌గా శివప్రసాద్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే జోన్‌లో కమిషనర్‌గా విధులు నిర్వహించిన తనను మళ్లీ ఇదే జోన్‌లో నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తామని భరోసానిచ్చారు.జోన్ పరిధిలోని రెవిన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్,ఎపిడి ఇతర విభాగాల అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా శివప్రసాద్ కలిశారు.

పలుచోట్ల అన్న క్యాంటీన్లు ప్రారంభం



అన్నక్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఏడోవార్డులో అన్నక్యాంటీన్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు.కార్యక్రమంలో వార్డ్ కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, పిళ్లా వెంకటరావు, జనసేన అధ్యక్షులు ఎస్ఎన్. నాయుడు, శాఖరి శ్రీను బాబు, నాగోతి సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, వాండ్రశి అప్పలరాజు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డులో అన్న క్యాంటీన్‌ను స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో కలిసి ఎంపి ఎం.శ్రీభరత్ ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, స్థానిక వార్డు కార్పొరేటర్ కంప హనోక్, ఉపాకిరణ్ బొడ్డేపల్లి రఘు, ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి పాల్గొన్నారు.

గోపాలపట్నం లో అన్న క్యాంటీన్ ప్రారంభం

గోపాలపట్నం : గోపాలపట్నం రైతుబజార్ సమీపంలో అన్న క్యాంటీన్‌ను విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌తో కలిసి ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు అన్నక్యాంటీన్లను పునరుద్ధరించి, పేదలకు నాణ్యమైన అల్పాహారం, భోజనం రూ.ఐదుకే అందిస్తున్నామని, ప్రజల అవసరానికి అనుగుణంగా మరిన్ని అన్నక్యాంటీన్లను పెంచుతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ మూడో వార్డు మేదరవీధిలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. జెడ్‌సి పి ప్రేమప్రసన్న వాణి, 2,3 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, పార్టీ నాయకులు కోరాడ రాజబాబు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, కొప్పల రమేష్‌లతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

శారద హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ఉచిత భోజనం

తగరపువలస జంక్షన్‌లో ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లో శుక్రవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి శారదమ్మ తన పేరిట ఉన్న హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ పేరుతో రెండ్రోజుల పాటు పేదలకు ఉచిత భోజనం, అల్పాహారం ఏర్పాటు చేశారు. శుక్రవారం తగరపువలస జంక్షన్ అన్న క్యాంటీన్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనం చేశారు.

కస్తూర్బా విద్యార్థినుల ఇండస్ట్రియల్ పరిశీలన



రైస్ మిల్లు సందర్శనలో కస్తూర్బా విద్యార్థినులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని నెల్లేరు కస్తూర్బాగాంధీ విద్యాలయ 9 ,10 తరగతి విద్యార్థులకు వృత్తి శిక్షణలో భాగంగా శుక్రవారం ఆనందపురం శ్రీసూర్య రాములు రైస్ మిల్లును సందర్శించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగమణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్వరాజ్యలక్ష్మి, ఝాన్సీ పర్యవేక్షణలో నేలతేరు సూర్యరాములు రైస్‌మిల్లులో ఫుడ్ గ్రేడింగ్, పేకింగ్ తదితర అంశాలపై అవగాహన పొందారు. మిల్లు మేనేజర్ జనార్ధనరావు, సిబ్బంది పైలా పెంటయ్య తదితరులు ధాన్యం నుంచి బియ్యం తయారీ, గ్రేడింగ్, ప్యాకింగ్ తదితర అంశాలను వివరించారు.

అవసరానికి మించి పురుగు మందులు వాడొద్దు

ప్రజాశక్తి -తగరపువలస : అవసరానికి మించి పంటలో పురుగు మందులు వాడొద్దని వ్యవసాయశాఖ భీమిలి డివిజన్ ఎడి బొడ్డేపల్లి విజయప్రసాద్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని తాటితూరు, వేములవారి కల్లాల వద్ద వ్యవసాయ క్షేత్రంలో మేలైన సాగుపద్ధతులపై పొలంబడి నిర్వహించారు. వరిపైర్లకు ఆశించిన ఆకుముడత, కాండం తొలుచు పురుగు నుంచి సస్యరక్షణ చర్యలు వివరించారు. లింగా కర్షణ బుట్టలు, వేపనూనె, పసుపు జిగురు అట్టల వల్ల ఉపయోగాలను తెలిపారు. కార్యక్రమంలో ఎఒ బి శివకోమలి, సిబ్బంది స్వాతి, కృపామణి, స్రవంతి, రమేష్, హరీష్ పాల్గొన్నారు

రోడ్డుపై మురుగు నీరుతో అవస్థలు

ప్రజాశక్తి- ఆనందపురం: వేములవలస పంచాయతీ పాత సినిమాహాల్ రోడ్డులో మురుగుకాలువల్లోని నీరు రహదారిపైనే ప్రవహిస్తుండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా మారుతోందని, ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'ఇది మంచి ప్రభుత్వం'పై ప్రచారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : రేఖవానిపాలెం పంచాయతీలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం'పై మండల ప్రత్యేకాధికారి, ఎస్‌డిసి సీతారామమూర్తి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి, ఇఒపిఆర్‌డి జి.అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఆనందపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మారికవలసకు చెందిన వెల్డర్ ఆర్.నర్సింగ రావుకు వెల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రెసిడెంట్ రఘు, అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ విజయ్,ఆనందపురం ఇంచార్జ్ వెన్ని.అప్పలరాజు , ముగడ శ్రీను, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఆనందపురం :మండల సర్వసభ్య సమావేశం ఈనెల 21న శనివారం ఉదయం 11 గంటలకు ఎంపిపి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ లవరాజు తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఇతర సభ్యులు హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమాచారంతో రావాలని సూచించారు.

పేరుకుపోయిన చెత్తతో అవస్థలు

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 25, 27 వార్డుల్లో ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోవడంతో నాలుగురోజులుగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. 27 వార్డు జోనల్ కార్యాలయం వెనుక రోడ్డు మార్గంలో నాలుగు రోజులుగాచెత్త పేరుకుపోవడంతో ఆ మార్గంలో పాఠశాలలు, కాలేజీలు, ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్‌కు వెళ్లే పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అలాగే 25వ వార్డు మధురానగర్ హైస్కూల్ లైన్‌లోనూ ఐదు రోజులుగా చెత్త తరలించడం లేదు. ఇప్పటికైనా జివిఎంసి పారిశుధ్య యంత్రాంగం స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వార్డుల్లో పేరుకుపోయిన చెత్త

నేరాలు ఘోరాలు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీ యాతపేట గ్రామానికి చెందిన గండిబోయిన దుర్గయ్య (45) ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం ప్రకారం తాగుడుకు బానిసై, భార్యకు డబ్బులు అడగ్గా ఇవ్వకపోవంతో మనస్తాపంతో ఉరేసుకుని మృత్యువాత పడ్డాడు. దుర్గయ్యకు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తెకు ఇటీవల వివాహం చేయగా,కుమారుడు మధు ఇంటర్ చదువుతున్నారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఆనందపురం పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థి మృత్యువాత

గంభీరం పంచాయతీ ఎస్సార్ కళాశాలలో ఇంటర్ సెకెండియర్ చదువుతున్న విద్యార్థి కె.భార్గవి అనారోగ్యంతో మృతి చెందాడు. తలనొప్పి రావడంతో వార్డెన్ సాయంతో గాయత్రి హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా, అక్కడ ఆరోగ్యం విషమించి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు, మృతురాలు భార్గవి అనకాపల్లి జిల్లా కశింకోట మండలం భీమవరం గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆనందపురం కేసు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగోవార్డు బీచ్‌రోడ్డు పక్కన మార్లిన్ కె హోటల్ వెనుక వ్యక్తి విశాఖ తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన భీసెట్టి మహేష్ (40) మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు సిఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపారు. కుటుంబ సమస్యలతో సముద్రంలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సుధాకర్ తెలిపారు.

నాలుగు లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ గ్రామ శివారులో శుక్రవారం ఉదయం దాడులు చేపట్టి 4లీటర్ల సారాతో ఒక వ్యక్తిని పట్టుకున్నామని ఎస్సై రామారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడి చేయడంతో గొలుగొండ గ్రామానికి చెందిన మట్ల చిలకారావు (60)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

64 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ పంచాయతీ శివారు శ్రీరాంపురం గ్రామ వై జంక్షన్ వద్ద గురువారం రాత్రి 64 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై టి.మల్లేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.... గురువారం సాయంత్రం శ్రీరాంపురం జంక్షన్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. అటుగా వస్తున్న ఐదుగురు యువకులు ప్రయాణిస్తున్న కారును తనిఖీ చేయగా, అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు పట్టుకునే సమయంలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోగా, మల్కన్‌గిరి జిల్లా జామిగూడ, పనసపుట్టు గ్రామానికి చెందిన రంజు వీర, అర్జున కీర, రూడ కార్తీక్ తదితర ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. కారులో ఉన్న 32 ప్యాకెట్లులో మొత్తం 64 కేజీల గంజాయి ఉండగా, దానిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని ఒరిస్సా రాష్ట్రం జామిగూడ గ్రామం నుంచి తీసుకొస్తున్నట్లు నిందితులు తెలిపారు. పట్టుబడిన ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి చోడవరం కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో చట్టం కింద కేసు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక చిన్నబజారుకు చెందిన 16 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసి మోసం చేసిన భీమిలి బ్యాంక్ కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సిఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన, నిందితుడిని అదుపులోకి తీసుకుని జువైనల్ హోంకు తరలించినట్లుసిఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నిందితునికి మూడు రోజుల జైలు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో వాహనం నడిపిన కేసులో నిందితునికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ట్రాఫిక్ ఎస్ఐ జి. ప్రసాద్ తెలిపారు. వివరాలివి. పిఎం.పాలెం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కొమ్మాది కె1కాలనీకి చెందిన పి.పైడిరాజు అనే వ్యక్తి మద్యం మత్తులో వాహనం నడుపుతుండగా, పోలీసుల తనిఖీల్లో పట్టుబడడంతో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విశాఖపట్నం స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు దీనిపై విచారణ జరిపి, నిందితునికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారని ఎస్ఐ తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కార్పొరేటర్, తదితరులు

ప్రజాశక్తి- గోపాలపట్నం : విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొని, తిరిగొచ్చిన జివిఎంసి 89వ వార్డు పరిధిలోని పారిశుధ్య కార్మికులను శుక్రవారం వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ సారథ్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జోన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అప్పలనాయుడు, శానిటరీ సూపర్వైజర్ కెవి.రమణ, గణపతి నగర్ సేవా సంఘం అధ్యక్షులు బూరెల అప్పలనాయుడు, శ్రీకృష్ణ దేవరాయ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు బూరెల నరసింగనాయుడు, గణపతినగర్ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు పూజారి గురునాథరావు, మంత్రి లక్ష్మణరావు, రెడ్డి కూర్మారావు, బుంగ నరసింహారావు, శానిటరీ, మలేరియా సిబ్బంది, ఆశా వర్కర్స్, స్థానికులు పాల్గొన్నారు

'ఆదర్శ'కు ఉత్తమ క్రమశిక్షణ అవార్డు



అవార్డు అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ప్రజాశక్తి -పెందుర్తి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ జిల్లాస్థాయి మార్చ్‌ఫాస్ట్ పరేడ్‌లో పాల్గొన్న ఆదర్శ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఉత్తమ క్రమశిక్షణ అవార్డును అందజేశారు. శుక్రవారం కాలేజీలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ ఎయిడ్‌డే సందర్భంగా కాంటిజెంట్ కమాండర్ మానసకుమారి నేతృత్వంలో పాల్గొన్న ఆదర్శ విద్యార్థుల బృందం చూపిన క్రమశిక్షణ, విధేయతకు ఈ అవార్డును రెడ్‌క్రాస్ సొసైటీ, డిస్ట్రిక్ట్ సెక్రటరీ పి.రవికుమార్, రిసోర్స్ పర్సన్, ట్రైనర్ మహ్మద్ రహంతుల్లా కళాశాల సెక్రటరీ టి.థియోఫిలస్, ఐఆర్‌సిఎస్ కోఆర్డినేటర్ జి.మంజులకు అందజేశారు.

వైసిపి గుర్తింపు రద్దు చేయాలి : గంటా

ప్రజాశక్తి-ఆనందపురం: జగన్మోహన్‌రెడ్డి లాంటి వ్యక్తికి రాజకీయాల్లో కొనసాగే నైతికహక్కు లేదని, వైసిపి గుర్తింపును రద్దుచేస్తేనే దేశానికి మంచిదని ఎన్నికల సంఘాన్ని కోరనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆనందపురంలో విలేకర్లతో మాట్లాడుతూ, హిందువులు పవిత్రంగా భావించే తిరుపతి లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వుతో కూడిన అవశేషాలు ఉన్నట్లు నిర్ధారణ జరిగిందన్నారు. విజయవాడ వరదలను మానవసృష్టిగా చంద్రబాబుపై దుష్ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సాక్షి పత్రికకు రూ.650 కోట్లు ప్రజాధనం దోచిపెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని జగన్ తీరుపై మండిపడ్డారు.

జివిఎంసిలో విలీనంతో 'ఉపాధి' కోల్పోతాం

ఆనందపురం మండలాన్ని గ్రేటర్ విశాఖలో విలీనం చేస్తే ఉపాధి హామీ పనులను కోల్పోతామని పలువురు డ్వాక్రా మహిళలు ఎమ్మెల్యే గంటా వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. జివిఎంసిలో విలీనంతో ఇంటిపన్నులు భారీగా పెరగడంతోపాటు, ఉపాధి హామీ పథకం దూరమౌతుందని, పేదలకు ఇచ్చే ఇళ్లస్థలాలు మూడు సెంట్లు దక్కకుండా పోతాయని ప్రశ్నించారు. దీనిపై గంటా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని భరోసానిచ్చారు.

సమస్యలపై వినతి

ఆనందపురం మండలంలో అన్నక్యాంటీన్ ఏర్పాటు, ఆనందపురంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, రైతుబజారు ఏర్పాటు తదితర సమస్యలపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడుతోపాటు, ఎం శివాజీ, లొడగల వెంకటరావు, కోరాడ తమ్మునాయుడు అంగిటి రాము, పోతిన గోవిందరావు, లంక నర్సింగరావు, కోరాడ వైకుంఠరావు, తాడివాడ శివరామకృష్ణ, ప్రశాంత్ కుమార్, శివ, శ్రీరామ్ జనసేన నాయకులు రాజు తదితరులు విన్నవించారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి- ములగాడ : ఉచిత ఇసుక పథకాన్ని అమలుచేసి, గృహనిర్మాణాలను ప్రోత్సాహించడంతోపాటు భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మల్కాపురం జోన్ గౌరవాధ్యక్షుడు కె.పెంటారావు డిమాండ్ చేశారు. శుక్రవారం 59వవార్డు నెహ్రూనగర్ లేబరు జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ఉచిత ఇసుక అమలు చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు గడిచినా ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక సక్రమంగా అమలు జరగడం లేదని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇళ్లు కట్టుకోలేకపోవడంతోపాటు భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘం వార్డు గౌరవాధ్యక్షుడు ఆర్.లక్ష్మణమూర్తి



సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల నిరసన

మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కొనసాగించి, కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేయాలని, బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, సూరి, గౌరునాయుడు పైడినాయుడు, రాజు, రాజేష్ శ్రీను, రాము పాల్గొన్నారు.

సన్యాసిరావు మరణం కళారంగానికి తీరని లోటు



నివాళులర్పిస్తున్న కళాకారులు, సిఐటియు నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రజా గాయకుడు, కవి, రచయిత, ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు జి సన్యాసిరావు మృతి కళారంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిఐటియు నాయకులు, కళాకారులు అన్నారు . శుక్రవారం జివిఎంసి మూడోవార్డు జమ్మి చెరువు పార్కు వద్ద ప్రజానాట్య మండలి భీమిలి డివిజన్ కళాకారుల ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సన్యాసిరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు భీమిలి జోన్ కమిటీ నాయకులు ఎస్ అప్పలనాయుడు, విశ్రాంత హెచ్ఎం ద త్రి ఈశ్వరరావు, ప్రజానాట్య మండలి కళాకారులు పంపాన సూర్య నారాయణ, దల్లి రాంబాబు, బి రామకృష్ణ, పి పోతురాజు పాల్గొన్నారు

జనాభా ప్రాతిపదికన కులగణన చేయాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : జనాభా ప్రాతిపదికన కులగణన చేపట్టాలని విశ్రాంత డిజిపి, బిఎస్‌పి ఎపి కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎపిలో కమ్మ, రెడ్డి అగ్రకులస్థులే రాజ్యాధికారం అనుభవిస్తున్నారన్నారు. కులగణన ద్వారా బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు నిజమైన సంక్షేమలబ్ధి, సామాజిక, రాజకీయ న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు బిసిలపై ఉన్న ప్రేమ మాటల్లోనే తప్ప ఆచరణలో అమలు జరగడం లేదన్నారు. వచ్చేనెల 9న బిసిలందరినీ కలుపుకుని విజయవాడలో భారీ బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, వరంజ్యోతి పాల్గొన్నారు.

వరుణ్ గ్రూపు కార్మికుల రక్తదానం



రక్తదానం చేస్తున్న వరుణ్ గ్రూప్ కార్మికులు, ఉద్యోగులు

ప్రజాశక్తి -గాజువాక: ఈనెల 22 న వరుణ్ గ్రూప్ సంస్థల చైర్మన్ ప్రభు కిషోర్ పుట్టినరోజు పురస్కరించుకొని, గాజువాక వరుణ్‌గ్రూప్ కార్యాలయంలోని ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం రక్తదానం చేశారు. 20ఏళ్లగా ఆనవాయితీగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గాజువాక మారుతి, వరుణ్ బజాజ్, బెంజ్, జెసిబి సంస్థల్లోని 200మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ద్వారకానగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో ప్రెసిడెంట్ పిజి లక్ష్మీనారాయణ, రీజియన్ చైర్‌పర్సన్ కె స్వతంత్ర్య కుమార్, బి.వెంకటరావు, కోఆర్డినేటర్ సుధాకరరావు పాల్గొన్నారు. రక్తదాతలకు మెమొంటో, సర్టిఫికెట్లను అందజేశారు

పది రోజులుగా తాగునీటికి ఇబ్బందులు

ప్రజాశక్తి- ఆనందపురం : స్థానిక హైస్కూల్ ప్రహరీ కూలి పైపులైను పగలడంతో పదిరోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని భూలోకమాత కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు ఈనెల 9న పాఠశాల ప్రహరీ కూలిన నాటి నుంచి నీటి సరఫరా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిరోజులుగడిచినా గోడ శిథిలాలను తొలగించక, పైపులైన్ మరమ్మతులు చేపట్టక నీటికి కటకటలాడే పరిస్థితులు కల్పించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనందపురం, లొడగలవానిపాలెం రెండు పంచాయతీల పరిధిలో సమస్య ఉండడంతో ఏఒక్కరూ పట్టించుకోవడం లేదని బిసి కాలనీ, శ్రమజీవుల కాలనీవాసులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.



పైపులైన్‌పై కూలిన హైస్కూల్ ప్రహరీ

జాబ్ మేళాలో 62 మంది ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్ర వారం నిర్వహించిన జాబ్ మేళా లో 62 మంది అభ్యర్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ తెలిపారు. టాటా ట్రెస్ట్ లిమిటెడ్ సంస్థ నుంచి మణికంఠ, బిడేటా టెక్నాలజీస్ సంస్థ నుంచి హిమజ , అపోలో నుంచి నాగశంకర్, ఫ్లూయెన్ట్రిడ్ నుంచి రామకృష్ణ పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. 244 మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా 62 మంది ఉద్యోగ ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి రమేష్ నాయుడు, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ పాల్గొన్నారు

సిపిఎం నేత నాగేశ్వరరావు హఠాన్మరణం



పి. నాగేశ్వరరావు

ప్రజాశక్తి- గాజువాక : సిపిఎం గాజువాక జోన్ కమిటీ మాజీ సభ్యుడు, సిఐటియు జోన్ మాజీ ఉపాధ్యక్షులు పి నాగేశ్వరరావు శుక్రవారం శ్రీనగర్ సమీపం దిబ్బపాలెం కాలనీలో గుండెపోటుతో హఠాన్మరణం పొందారు. భవన నిర్మాణం, తోపుడుబళ్ల కార్మికుల సమస్యల పరిష్కారానికి నాగేశ్వరరావు చేసిన కృషి మరువలేనిది. సర్వే నెంబరు 274లో ఇల్లు తొలగించినప్పుడు, పేదల పక్షాన పోరాటం చేశారు. ఇరిగేషన్ కార్మిక సమస్యలపైనా పెద్ద ఎత్తున పోరాటం చేశారు. ఇరిగేషన్ నాగేశ్వరరావుగా అందరికీ సుపరిచితులైన నాగేశ్వరరావు భార్య శారద గతంలో ప్రజాశక్తిలో పనిచేశారు.

ఎన్ఎడిలో హిమాలయ ఆప్టికల్ స్టోర్



నూతన షోరూం ప్రారంభోత్సవంలో సినీ నటి అనన్య

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: కళ్లజోళ్ళ రంగంలో 85 ఏళ్ల అనుభవం కలిగిన హిమాలయ ఆప్టికల్ స్టోర్ నూతన షోరూంను ఎన్ఎడి వద్ద సినీ నటి అనన్య నాగళ్ల శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. ఇది రాష్ట్రంలో 9వ, విశాఖ నగరంలో 7వ స్టోర్‌ను ప్రారంభించిన సందర్భంగా . హిమాలయా ఆప్టికల్ రీజినల్ హెడ్ మయాంక్ బంగూర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక హంగులతో వినియోగదారుల అవసరాలను తీర్చడంలో హిమాలయ ఆప్టికల్స్ ఎప్పుడు ముందుంటుందన్నారు. విస్తృత శ్రేణి బ్రాండెడ్ సన్ గ్లాసెస్‌ను ఆరునెలల వారంటీతో అందించడంతోపాటు అనుభవజ్ఞులైన ఆప్టోమెట్రిస్టులు బృందం పర్యవేక్షణలో పిల్లలకు మయోపియా నిర్వహణ ప్రత్యేకత కలిగిన స్పెషలిస్ట్ లెన్స్‌లు, ఉచిత ట్రయల్స్‌తో కోరిన విధంగా కాంటాక్ట్ లెన్స్‌లను తయారుచేసి అందిస్తుదన్నారు. రేబాన్, వోగ్, టామీ హిల్‌ఫిగర్, మోంట్ బ్లాంక్, బుర్‌బెర్రీ, ఎంపోరియో అర్మానీ, ఫిలా పోలీస్‌వంటి ప్రపంచ శ్రేణి బ్రాండ్ల నుంచి హైఎండ్ ఫ్రేమ్‌లు, సన్ గ్లాసెస్ అందుబాటులో ఉంటాయన్నారు.

కొండవాలులో వీధి దీపాలు వేయండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదోవార్డు కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్‌స్తంభాలకు వీధిదీపాలు లేక రాత్రివేళల్లో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆయా ప్రాంతాల్లో వీధిలైట్లు వేయాలని స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పిపి-1,2, ఎన్‌టిఆర్ హుద్ హుద్ కాలనీ, మారికవలస జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, వైఎస్ఆర్.కాలనీ, రాజీవ్ గృహకల్ప కాలనీ తదితర ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో ప్రజల రాకపోకలకు అనువుగా రింగ్‌పోల్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు ఉన్నారు.

జివిఎంసి కమిషనర్‌కు సమస్యల నివేదన

గాజువాక :జివిఎంసి 65వ వార్డులోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ప్రధాన కమిషనర్ సంపత్ కుమార్‌కు వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు విన్నవించారు.కొండవాలు ప్రాంతాలతో సవాలక్ష సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపడతామని హామీనిచ్చినట్లు తెలిపారు..

పారిశ్రామిక ప్రాంత ప్రజలు, కార్మికుల

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

- ఫార్మా, సెజ్ కార్మికుల రక్షణ యాత్ర ముగింపు సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

- కార్మికుల సమస్యలపై రాజకీయ నాయకులను నిలదీయాలి : ప్రభావతి

- కంపెనీల యాజమాన్యాలకు కొమ్ము కాస్తున్న ప్రభుత్వాలు : జగ్గునాయుడు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పరిశ్రమల ప్రాంతాల్లో నివసించే ప్రజల సమస్యలు పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. జిల్లాలో ఫార్మా, సెజ్ కార్మికులు, ఉద్యోగులు, ప్రజల భద్రత కోసం ఐదు రోజుల పాటు నిర్వహించిన సిపిఎం రక్షణ యాత్ర ముగింపు సభ శుక్రవారం అచ్యుతాపురం జంక్షన్ వద్ద పార్టీ మండల కన్వీనర్ ఆర్.రాము అధ్యక్షతన జరిగింది. ఆ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం మాట్లాడుతూ పరవాడ నుండి పాయకరావుపేట వరకు ఉన్న పరిశ్రమల్లో ఉద్యోగాలు వస్తాయని ఆశించిన ప్రజానీకానికి నిరాశ మిగిలిందన్నారు. పైగా ఈ పరిశ్రమల కారణంగా ఏ సమయంలో ఎవరి ప్రాణాలు ఏ విధంగా పోతాయో తెలియలేని అయోమయ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల పరిసర గ్రామాలలో 3వేల మందిని కలవగా తమకెవరికీ సౌఖ్యంగా లేదని చెప్పినట్లు లోకనాథం తెలిపారు. ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో ప్రాణాలు పోయిన కార్మిక కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున పరిహారం ఇచ్చినా ఆయా కుటుంబాలలో ఎటువంటి ఆనందచాయలు కనిపించలేదని, ఎన్ని కోట్లు ఇస్తే తమ పిల్లల ప్రాణాలు తిరిగి వస్తాయని వారు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి మాట్లాడుతూ పరిశ్రమల ప్రమాదాలు కారణంగా జిల్లాలో 60 మంది చనిపోయారని అధికారిక లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై రాజకీయ నాయకులను నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ కార్మిక చట్టాలు అమలు కాకపోవడం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు రక్షణ కరువైందన్నారు. ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేయడం లేదని, ప్రభుత్వాలు, అధికార పార్టీలు ఫ్యాక్టరీల యాజమాన్యాలకు కొమ్ము కాస్తున్నాయని విమర్శించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ పరిశ్రమల కారణంగా రానున్న తరాలు ఎలా బతుకుతాయో అనే దిగులుతో ఈ ప్రాంత ప్రజలు జీవిస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు వైద్య సేవలు అందించడానికి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేక ప్రాణాలు పోతున్నాయని, వెంటనే ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, నాయకులు జి.దేముడు నాయుడు, కర్రి అప్పారావు, కె.రామసదాశివరావు, వి.వి.శ్రీనివాసరావు, కె.సోము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి బహిరంగ సభ వేదికగా ఘనంగా నివాళులర్పించారు. ఏచూరి చిత్ర పటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, అనకాపల్లి విశాఖ జిల్లాల కార్యదర్శులు కె.లోకనాథం ఎం జగ్గినాయుడు తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

పరవాడ మండలంలో కార్మిక రక్షణ యాత్ర

పరవాడ : ఫార్మా, సెజ్ కార్మికులకు రక్షణ కల్పించాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆధ్వర్యంలో చేపట్టిన రక్షణ యాత్ర గురువారం రాత్రి మండలంలోని తాణాం చేరుకుంది. రాత్రికి తాడి గ్రామంలో సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఉదయం లంకెలపాలెం జంక్షన్‌లో కార్మికులతో జరిగిన సమావేశంలో లోకనాథం, పరవాడ సినిమా హాల్ జంక్షన్లో జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి ప్రభావతి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులతో పాటు స్థానిక నాయకులు పి మాణిక్యం, వివి రమణ, డి దేముడు, కరణం వెంకట్రావు, పాల్గొన్నారు.



కార్మిక రక్షణ యాత్రలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభావతి

నేడు సీతారాం ఏచూరి సంతాప సభ

ప్రజాశక్తి-అనకాపల్లి : సిపిఎం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాపసభ ఈ నెల 21న శనివారం సాయంత్రం 4 గంటలకు అనకాపల్లి గవరపాలెం గౌరీ గ్రంథాలయం మేడపై కొణతాల సుబ్రహ్మణ్యం హాలులో జరుగుతుందని సిపిఎం నాయకులు ఎస్ఎస్ఎస్.నారాయణ, కాళ్ళ తేలయ్యబాబు, పెంటకోట శ్రీనివాసరావు, బుగిడి నూక అప్పారావు తెలిపారు. ఈ సంతాపసభకు ముఖ్య వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. పట్టణ ప్రముఖులు, పురప్రజలు హాజరై ఈ సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

అక్కినేని నాగేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి కార్యక్రమంలో స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగ భూషణం ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అక్కినేని చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాగ భూషణం మాట్లాడుతూ నాగేశ్వరరావు తెలుగు చలన చలనచిత్ర రంగానికి అనన్యమైన సేవలను అందించినట్లు చెప్పారు. ఆయనకు భారత రత్న పురస్కారం ఇచ్చి గౌరవించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నాయకులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల క్రిష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, ఉజ్జి సత్యనారాయణ, కొత్తుర్తి రామారావు, సందేల అప్పారావు, యర్రా సత్యనారాయణ, బోడా అప్పలరాజు పాల్గొన్నారు.

వేతనాలు పెంచకుంటే సమ్మె చేస్తాం

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ డెయిరీ సహకార సంఘాల ద్వారా పాలను సేకరించి డెయిరీకి పంపుతూ సంస్థ లాభాల బాటలో నడిచేందుకు కృషి చేస్తున్న పాల సంఘాల కార్యదర్శులకు, వర్కర్లకు తక్షణమే జీతాలు పెంచకుంటే సమ్మెకు దిగాల్సి ఉంటుందని నాయకులు హెచ్చరించారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఐదు సంవత్సరాలుగా జీతాలు పెంచకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. స్థానిక నూకాలమ్మ గుడి రోడ్‌లో ఉన్న సత్యాస్ లక్ష్మీ గ్రాండ్స్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సంఘం అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల సర్వసభ్య సమావేశంలో పలువురు మాట్లాడారు. కార్మికులను డెయిరీ ఉద్యోగులుగా గుర్తించి కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటి వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు వైఎన్.భద్రం, రాజాన దొరబాబు, సంఘం నాయకులు దొడ్డి సూర్యారావు, జి.కనకారావు, ప్రసాద్, జామి అప్పలనాయుడు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు డిపిఎన్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కశింకోట

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఆచంట రవి తెలిపారు. అనకాపల్లి ఎన్‌టిఆర్ స్టేడియంలో జరిగిన 68వ ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జూడో అండర్ 17 బాలుర విభాగంలో తమ పాఠశాలకు చెందిన బి. రోహిత్, ఎం. శరత్, కె. అఖిల్, అజీజ్ స్వర్ణపథకాలు, జె. మధు, వంశీ కృష్ణ రజిత పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. వీరు త్వరలో జరుగు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు వెళతారని పిడి ప్రభాకర్ తెలిపారు. వీరిని హెచ్‌ఎంతో పాటు విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయులు ఎంజెవికె.ప్రసాద్, ఆనంద్, అప్పారావు, లక్ష్మీ కాంతం అభినందించారు.

వడ్డాది విద్యార్థులు...

వడ్డాది : రాష్ట్రస్థాయి జూడో గేమ్స్‌కి వడ్డాది హైస్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 19న అనకాపల్లిలో జరిగిన జోనల్ స్థాయి జూడో గేమ్స్ పోటీలలో ఎనిమిదో తరగతి విద్యార్థులు దాసరి రోహిణి, ఆర్. రిషి, జి.చరణ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 23 నుండి తిరుపతిలో జరగబోయే స్టేట్ జూడో గేమ్స్‌లో వీరు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విద్యార్థులను హెచ్ఎం పివి శేషుబాబు, ఎస్ఎంసి చైర్మన్ కోవెల వెంకటరమణ, డ్రిల్ మాస్టర్ నరసింగరావు అభినందించారు.

అథ్లెటిక్స్‌లో సెయింట్ జాన్స్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- కశింకోట : ఇటీవల సిబిఎస్ఇ ఆధ్వర్యంలో నల్గొండలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్.జాన్సీ ప్రతిభ చూపింది. 100 మీటర్ల పరుగు పందెంలో రెండు స్థానం సాధించింది. జాన్సీని పాఠశాల ప్రిన్సిపాల్ రూపనంద, అకడమిక్ ఇన్‌చార్జ్ పి.చంద్రమౌళి, పిఇటి, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు.

ఇంగ్లీషు లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని ధర్నా


కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - యలమంచిలి

స్థానిక తులసీనగర్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులను అగచాట్లకు గురిచేస్తున్న ఇంగ్లీషు లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు కళాశాల ఎదుట శుక్రవారం ధర్నాకు దిగారు. విద్యార్థినుల పట్ల ఆమె అసభ్యకర పదజాలంతో దూషిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారు అనకాపల్లి కలెక్టర్ ఆఫీసులో ఇంగ్లీషు లెక్చరర్‌పై ఫిర్యాదు చేపినట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఆ ఆంగ్ల అధ్యాపకురాలు సమయ పాలన లేకుండా కాలేజీకి వస్తుంటారని, క్లాసు విద్యార్థులకు పాఠాలు బోధించకుండానే కాలక్షేపం చేసి ఎప్పుడు కాలేజీ నుంచి పోతారో ఎవరికీ తెలీదని విద్యార్థులు వాపోయారు. ఆమె ప్రవర్తనపై ప్రిన్సిపాల్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు చేపట్టకపోవడం విచిత్రంగా ఉందన్నారు. సెలవులు లేకున్నా అడ్డూ అదుపూ లేకుండా కాలేజీ క్లాసులకు ఎగ్గొట్టడం ఆనవాయితీగా మారిందన్నారు. దీనిపై విచారణ జరుగుతోందని, ఆమెపై త్వరలోనే శాఖాపరమైన చర్యలు చేపడతామని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ, జయ, రవి, గణేష్, కేశవ, శ్రీను, రామలక్ష్మణ్, కృపానంద, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసిసి అధ్యక్షునిగా సుబ్బన్న ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి న్యూ కాలనీలో ఉన్న ప్రైవేటు ఫంక్షన్ హాల్లో శుక్రవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా మీసాల సుబ్బన్న ప్రమాణ స్వీకారం చేశారు. సుబ్బన్న చేత సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి ఏస్ దత్తు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సుబ్బన్నను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రామారావు, పార్టీ నాయకులు విప్పల పైడయ్య, తనకాల అనంతరావు, మలపురెడ్డి కోటేశ్వర రావు, బోయిన భానుమూర్తి యాదవ్, తుట్టా రమణ, కత్తెర శ్రీధర్, పడాల కొండల రావు, కాళ్ళ సత్యనారాయణ, విస్సకోట రాము, ఆర్ఆర్ నాయుడు, సుందరపు ఈశ్వరరావు, చక్రి, గోవింద్, ఎమ్.గంగరాజు, ఎస్.రమణ, కె.సత్యనారాయణ, బి.రమణ, ఆది మూర్తి, బి.రాజు, టి.గణపతి, ఎమ్.నాయుడు, జి గుణబాబు, బి.కిషోర్, బి బాల మురళి, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

3 నుంచి దసరా నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయ దశమిని పురస్కరించుకుని అనకాపల్లి గవరపాలెం శ్రీ కనకదుర్గమ్మ ఆలయం ఆధ్వర్యంలో దసరా నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద పందిరాట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ రాట పూజలో పి వెంకట అప్పారావు, పొలిమేర శ్రీను, బుద్ధ సంతోష దంపతులు పాల్గొన్నారు. దసరా ఉత్సవాలకు నూతన ఉత్సవ కమిటీని నియమించారు. ఈ కమిటీ రెండు సంవత్సరాలు పాటు కొనసాగుతుందని ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ప్రముఖ వ్యాపారవేత్త భీమశెట్టి వరాహనూకరాజు, ధర్మకర్తలుగా 9 మందిని నియమించారు. దేవి శరన్నవరాత్రుల కరపత్రాన్ని, ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దాడి జేయవీర్, కొణతాల మురళీకృష్ణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై దృష్టి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా టాస్కోర్స్ బందం పేర్కొంది. కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అనకాపల్లి మండలం పరిధిలోని కొత్తూరు -2 రామాపురం హెల్త్ వెల్ నెస్ సెంటర్‌ను రెండో రోజులో శుక్రవారం డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమ్యూనిటీ టీమ్ సందర్శించింది. చైల్డ్ సర్వీసెస్, గర్భిణీ సేవల పై ఆరా తీశారు. రికార్డ్స్ ను పరిశీలించారు. స్కూల్ పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు జరుగుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ లూసి, జగదీష్, ఎస్ఓ రామచంద్రావు, డీపీహెచ్ఎన్ఓ నాగమణి, సత్యనారాయణ, విజయలక్ష్మి, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం

యాదవ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-బుచ్చియ్యపేట : జిల్లా యాదవ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బర్కికాన బాబురావు ఆధ్వర్యంలో బుచ్చియ్యపేటలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో బుచ్చెయ్యపేట మండల యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా వడ్డాది గ్రామానికి చెందిన సింగంపల్లి రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా నేతవాణిపాలెం గ్రామానికి చెందిన వియ్యపు రామారావు ఎన్నికయ్యారు. మండల గౌరవాధ్యక్షునిగా ముల్లి రామనాయుడు, మండల కార్యవర్గాన్ని నియమించారు. కార్యక్రమంలో గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట ఎస్ఐగా నూతనంగా విధుల్లో చేరిన ఎ.శ్రీనివాసరావును శుక్రవారం మండలంలోని తెలుగుదేశం నాయకులు కలిసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ వియ్యపు అప్పారావు, మాజీ ఎంపీటీసీలు గోన్నాబత్తుల శ్రీనివాసరావు, వియ్యపు మరిడిబాబు, చిన్ని పైడిరాజు, సీత మాణిక్యం, ముమ్మిన నాగరాజు, శానపతి మణికంఠ, సీత సన్యాసినాయుడు, సింగంపల్లి రమేష్, తాటికొండ గణేష్, గాలి శ్రీను పాల్గొన్నారు.

వైద్య ఒప్పంద కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-కె.కోటపాడు : సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, సూపర్ వైజర్ కార్మికుల సమస్యలపై వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేక ఈ నెల 30 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీ లక్ష్మికి సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో నూకరత్నం, అరుణ, సత్యవతి, ఈశ్వరమ్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రైవేటీకరణ సరికాదు

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్రంలోని నూతన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరికాదని, ఆ నిర్ణయంపై సర్కార్ పునరాలోచించ చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైద్య కళాశాలలను కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లో పెడితే మెడికల్ విద్యార్థులకు ఆర్థికపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి-వడ్డాది : పౌష్టిక ఆహారంతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం రాజరాజేశ్వరి అన్నారు. బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట అంగన్వాడి కేంద్రంలో పౌష్టిక ఆహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సామూహిక శ్రీమంతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ భార్గవి, వైద్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు కుసుమకుమారి, రాధ, లక్ష్మి దేవి, అరుణ పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి

ప్రజాశక్తి - పరవాడ : జివిఎంసి 79వ వార్డు లంకెలపాలెంలో పలు సమస్యలపై గ్రేటర్ విశాఖ మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. గళ్ళవానిపాలెం చెరువును అభివృద్ధి చేయాలని, ముఖ్యమైన పనులకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

పోలీసుల సమస్యలపై అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ ఎం.దీపిక కార్యాలయంలో "పోలీస్ గ్రీవెన్స్ డే" నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థుల సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన బైఠాయించిన విద్యార్థులు

ప్రజాశక్తి -అనకాపల్లి

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన విద్యార్థులు అనకాపల్లి కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, పాయకరావుపేట, చోడవరం తదితర ప్రాంతాల నుంచి సుమారు 1500 మంది విద్యార్థులు చలో కలెక్టరేట్ కార్యక్రమానికి తరలివచ్చారు. కలెక్టరేట్ ముందు బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు జి.గీతకృష్ణ, ఎం.రమణ, ఉపాధ్యక్షులు ఎం.బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వానికి వంద రోజులు పూర్తయినా విద్యార్థుల సమస్యలను పట్టించుకోలేన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ వసతిగృహాల్లో మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వసతి దీవెన, విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఎంతోమంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సకాలంలో స్కాలర్ షిప్‌లు విడుదల చేయాలని, సంక్షేమ వసతి గృహాల్లో మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించాలని కోరారు. హాస్టల్లో వాడిక నీటినే తాగడానికి కూడా ఉపయోగించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఎంతోమంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ సమస్యలపై డిఆర్ఓ దయానిధికి వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వారంలో ప్రతి ఒక్క హాస్టల్‌కు దోమల తెరలు అందిస్తామని, మినీ వాటర్ ప్లాంట్ కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు కేశవ, శ్రీను, కామేష్, వెంకటేష్, రమేష్, నర్సీపట్నం డివిజన్ నాయకులు జ్ఞానేశ్, స్వామి, అర్జున్, దుర్గా, మోహన్, సాయి, వరహాలు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన విద్యార్థులు

గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి చోడవరం

చోడవరం (గోవాడ) చక్కెర కర్మాగారంపై టిడిపి కూటమి నాయకులు మొసలి కన్నీరు కార్చడం వల్ల ఉపయోగం లేదని, సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని ఆధునికీకరించాలని, రైతులకు మద్దతు ధర కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం నిరాహార దీక్షలు, పాదయాత్రలు చేసి, అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు మహాజన సభ దగ్గర పడడంతో కూటమి నాయకులు ఎమ్‌డికి వినతిపత్రాలు ఇచ్చి రైతులను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఫ్యాక్టరీని ఆధునికీకరించి దానికి పూర్వ వైభవం తీసుకొస్తామని, రైతులను ఆదుకుంటామని ఎన్నికల్లో ఎంపీ సిఎం.రమేష్, కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ఫ్యాక్టరీపై ఆధారపడి జీవిస్తున్న వెయ్యి మంది కార్మిక కుటుంబాలు, 24 వేల రైతుల కుటుంబాలు కూటమి నేతలను గెలిపించి, ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాని ఎన్నికల్లో గెలిచిన తరువాత ఎంపీ సిఎం.రమేష్ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. తక్షణమే రైతులకు బకాయిలకు, ఫ్యాక్టరీలో ఇంజనీరింగ్, బాయిలింగ్ సెక్షన్లల్లో పనులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న జరనున్న మహాజన సభలో ఫ్యాక్టరీ ఆధునికీకరణ, మద్దతు ధర కోసం కూటమి నేతలను నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు.

ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాల్లో చేపట్టే ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు సమాచారం వారి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని మండలం స్థాయి అధికారులకు ఎంపీడీఓ ఎస్.అప్పలరాజు సూచించారు. స్థానిక మండలం పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఇటీవల ఆర్లిలో సెజ్ నిమిత్తం భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటనలో ఎంపీపీ, ఆర్లి ఎంపీటీసీ సభ్యుడైన రెడ్డి జగన్ మోహన్‌కు ఎందుకు సమాచారం ఇవ్వలేదని చౌడువాడ ఎంపీటీసీ సభ్యుడు ఏటుకూరి రాజేష్ డిప్యూటీ తహశీల్దారు, ఎంపీడీఓలను నిలదీశారు. దీనికి స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ ఆర్లిలో కలెక్టర్ కార్యక్రమం ముందురోజు రాత్రి సుమారు 7.30 గంటల వరకు ఖరారు కాలేదని, సమయాభావం, పనుల్లో నిమగ్నం కావడంతో ఎంపీపీకి సమాచారం ఇవ్వలేకపోయాం తప్ప ఉద్దేశపూర్వకంగా కాదని తెలిపారు. ఇకపై ప్రోటోకాల్ పాటించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటామని ఎంపీడీఓ అప్పలరాజు చెప్పారు. తమ గ్రామ వీఆర్‌పిపై ఫిర్యాదు అసత్యమని విచారణలో తేలినందున చర్యలు తీసుకోవద్దని ఎల్‌వి.పాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు అధికారులను కోరారు. రీసర్వే డేటాపై చౌడువాడ ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, ఈ-క్రాప్ నమోదుపై సూదివలస ఎంపీటీసీ వర్రి రామునాయుడు తమ సందేహాలను హెచ్‌డిటి రమేష్‌ను ఏఓ సోమశేఖర్‌ను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-సబ్బవరం : డిగ్రీ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జీ, ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు కళాశాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడం, వెళ్లే దారిలో చెత్తను వేయడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కళాశాలకు ప్రహరీ లేదన్నారు. సరిపడ తరగతి గదులు లేక ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులకు ఉదయం, సైన్స్ గ్రూప్ విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటిపూట తరగతులను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే కళాశాలకు అదనపు తరగతులు గదులు, ప్రహరీగోడ, రహదారి నిర్మించాలని, మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇమానుయేలు, ఆది, శ్రీను, నిస్సి, ధనలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి- యలమంచిలి: ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో యలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాలలో వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వై.వి.రమణ ఓజోన్ పొర ఆవశ్యకత గురించి వివరించారు. అధికంగా రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు వాడడం వలన వాటి నుండి వెలువడే క్లోరోఫ్లోరో కార్బన్లు వలన ఓజోన్ పొర దెబ్బతింటుందని తెలిపారు. జీవావరణానికి రక్షణ కవచంగా ఉండే ఓజోన్ పొర మానవ స్వయంకృతాపరాధం వలన నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్ వెంకట గిరి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగిన ధర్నా

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం విద్యుత్ సబ్ స్టేషన్లో షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగం కోసం ఆర్.భీమవరం, నీలకంఠాపురం గ్రామాల టిడిపి నాయకులు, ప్రజలు చేపట్టిన ధర్నా రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగించారు. షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ మృతి చెందిన రొంగలి నర్సింగరావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ పోస్టుకి స్థానికేతరుడైన దొండపూడికి చెందిన వ్యక్తిని ఎంపిక చేయడం అన్యాయమన్నారు. భర్త మృతితో కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న నర్సింగరావు భార్య రామలక్ష్మి కుటుంబ సభ్యులకే షిఫ్ట్ ఆపరేటర్ పోస్ట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రాజు, పార్టీ పెద్దలు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మృతుడి భార్య రామలక్ష్మి, మాజీ సర్పంచులు మలిరెడ్డి బుజ్జి, కోట సత్యనారాయణ, ఎంపిటిసి శ్రీను, మాజీ ఎంపిటిసి వెలంకాయల అప్పలనాయుడు, మహిళలు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం సుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు బకాయి ఉన్న మూడు కోట్ల రూపాయల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఫ్యాక్టరీ గేటు ముందు కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.భాస్కరరావు మాట్లాడుతూ గడచిన ఆరు నెలలుగా రీకాల్ లేక కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని, ఇటువంటి కష్టకాలంలో కార్మికులను ఆదుకునేందుకు వారికి రావలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మేనేజింగ్ డైరెక్టర్ బకాయిలు చెల్లింపునకు సానుకూలంగా స్పందించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక నారాయణరావు, రాపేటి జగన్నాథరావు, నానిబాబు, నూకరాజు, బండి శ్రీను, ప్రకాష్ పాల్గొన్నారు.

ఎస్ఐ సుధాకరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం ఎస్ఐగా కె.సుధాకర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సుధాకరరావు నర్సీపట్నం టౌన్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఉత్సాహంగా మండల స్థాయి పోటీలు



కొత్తకోటలో ఆడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి -చీడికాడ:విద్యార్థులలో క్రీడా నైపుణ్యతను వెలికి తీయడానికి ఆటల పోటీలు ఎంతో దోహదపడతాయని ఎంఈఓ 2 బి.రమణ తెలిపారు. మండలంలోని చుక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బివి రమణ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మండల పరిషత్ అధ్యక్షులు కే జయమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, షటిల్, రన్నింగ్, వాలీబాల్ టెన్నికాయిట్, షార్ట్ పుట్ వంటి క్రీడలు నిర్వహించారు. మండలంలో జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలల నుండి 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ఈనెల 27న జరిగే హాజరవుతారని ఎంఈఓ బివి రమణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి లక్ష్మణ మ్మ, ఎంపిటీసీ సుంకర వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తకోట:రావికమతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలుర క్రీడా పోటీలను ఎంఈవో బ్రహ్మాజీ, పాఠశాల కమిటీ చైర్మన్ భూసాల అప్పారావు, హెచ్ఎం మల్లికార్జునరావు ప్రారంభించారు. మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 115 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 45 మంది క్రీడాకారులను నియోజ కవర్గం స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. వాలీబాల్ పోటీలలో ప్రధమ, ద్వితీయ స్థానాలు చిన పాచిల, మరుపాక మోడల్ పాఠశాల విద్యార్థులు నిలవగా, షటిల్ మెడివాడ, టి.అర్జా పురం,చెస్‌లో కొత్తకోట, టి అర్జా పురం, కబ్బడిలో కొత్తకోట, మరుపాక మోడల్ పాఠశాల, ఖో ఖోలో దొండపూడి, మేడివాడ పాఠశాల లకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపారు...

కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం బాలికలకు పలు పోటీలను ఫిజికల్ డైరెక్టర్ గణేష్ నిర్వహించారు కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బాలుర, బాలికలు పాఠశాలల క్రీడా ఎంపిక పోటీల ప్రారంభమయ్యాయి. పాఠశాల హెచ్ఎం వి.నాగభూషణం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, సర్పంచ్ లోచల సుజాత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖధికారి సత్యనారాయణ, పాఠశాల చైర్మన్ లగుడు రాజుల నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు టివి.రమణ, ఎంపిటిసిలు మామిడి కృష్ణ, రుత్తల రామకృష్ణ, చింతల బుల్లిప్రసాద్, సుర్ల అనివాష్, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపించాలని, విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమైన ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు పడాల్ దాస్, ఉషారాణి, వైస్ ఎంపీపీ ఊర్రోకల గంగభవాని, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, మండలంలోని అన్ని పాఠశాలల పిఈటిలు పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో...

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం



నర్సీపట్నంలో ప్రచారం చేస్తున పద్మావతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీలో 26వ వార్డులో వంద రోజుల పాలనపై శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి హాజరై ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, సచివాలయం సిబ్బంది, 26వ వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చెట్టు పల్లి గ్రామంలో కూటమి నాయకులు గడపగడపకు తిరిగి వివరించారు.

కోటవురట్ల : ఇది మంచి ప్రభుత్వం పేరుతో కూటమి ప్రభుత్వం 100 రోజులలో సాధించిన విజయాలపై ప్రచారం చేపట్టారు. మండల ప్రత్యేక అధికారిని అరుణ శ్రీ, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, ఈఓపిఆర్డి భానుజీరావులు పలు గ్రామాలలో ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రచారం చేపట్టారు.

గొలుగొండ:మండలంలోని జోగుంపేట గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, మాజీ సర్పంచ్ సుర్ల సీతారామమూర్తి, సాలికమల్లవరం మాజీ సర్పంచ్ కొల్లాన కొండలరావు ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలనపై ప్రచారం చేపట్టారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.రఘురాం, ఈవోపిఆర్‌డి రమణయ్య, పాల్గొన్నారు. ఏఎల్ పురంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

అనకాపల్లి:రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తియిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో కలెక్టర్ విజయ క్రిష్ణన్ ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఎల్‌డిఓ మంజులవాణి, సర్పంచు మార్టూరు సన్యాసమ్మ, ఎంపీడీవో నరసింహారావు, ఈవో ఈశ్వరరావు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇది మంచి ప్రభుత్వంపై అవగాహన ప్రదర్శన నిర్వహించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. జీవీఎంసీ 80వ వార్డు చినరామస్వామి కోవెల వీధి, దుడ్డువీధి, దేవుడుతోట ప్రాంతాలలో తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి ఆధ్వర్యాన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సూరిశెట్టి రాముడు, బుద్ధ ఈశ్వరరావు, కర్రి శివ, సూరిశెట్టి శివ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లను టిడిపి కూటమి నాయకులు ఆవిష్కరించారు. వాటిని ఇళ్లకు అతికించారు.

వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం ఎల్‌బిపి అగ్రహారం వడ్డాదిలో టిడిపి కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్‌బిపి అగ్రహారం మాజీ సర్పంచ్ తమరణ దాసు, దొండ నరేష్, యడ్ల రామ్మూర్తి పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని మేడిచర్ల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఇంటింటికి తిరిగి గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి గల తేడాను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రొంగలి మహేష్, పూడి నారాయణమూర్తి, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని ఇరువాడ గ్రామంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు, గోడ పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు సాలాపు వెంకటేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకట రమణ, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి ముత్యాల నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ కశింకోటలో ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వంపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటిమి నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు, స్టిక్కర్లు అందించారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కిలపర్తి భాస్కరరావు, చల్లా నానాజీ, మండల ప్రత్యేక అధికారి సిహెచ్ రవీంద్రనాథ్, ఎంపీడీఓ సిహెచ్ చంద్రశేఖర్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల్లో చేసిన మంచిని, చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం 27వ వార్డు నెహ్రూ బజారు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ సెక్రటరీ డి.కీర్తి, సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ పాల్గొన్నారు.

పెందుర్తి : వందరోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ ఎన్నో మంచి కార్యక్రమాలను చేపట్టి, ప్రజలతో ఇది మంచి ప్రభుత్వం అనిపించుకున్నామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం ముదపాక గ్రామంలో చేపట్టిన కార్యక్రమంలో వందరోజుల కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు.కార్యక్రమంలోటిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ గండి బాబ్జి, ప్రత్యేకాధికారి శేష శైలజ పాల్గొన్నారు

ఆనందపురం : ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని, వందరోజుల కూటమిపాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్,భాస్కరరెడ్డి, కూటమి నేతలు కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్, కె.రామానాయుడు, జి.సుభాష్ చంద్రబోస్, ఎంపిడిఒ లవ రాజు, తహశీల్దార్ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు

ఆరిలోవ : 12వ వార్డు టిడిపి నాయకుల ఆధ్వర్యంలో గణబాబు నగర్, సూర్యతేజనగర్, బిటిఆర్ నగర్ ప్రాంతాల్లో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంచారు. స్టిక్కర్లను అతికించారు టిడిపి నాయకులు గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, ముగడ రాజారావు పాల్గొన్నారు.

10వ వార్డులో...కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదర్శనగర్, ఎస్‌ఐజి నగర్ ప్రాంతాల్లో, 13వ వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ ప్రాంతాలో ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. వార్డు టిడిపి అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, మద్దిల రాజేష్, తులసీ పార్వతి పాల్గొన్నారు.



ఆనందపురంలో ప్రచారం చేపడుతున్న గంటా



భూమిని పరిశీలిస్తున్న అధికారులు

ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన

ప్రజాశక్తి-కోటవురట:మండల వ్యాప్తంగా 17 గ్రామాలలో 570 ఎకరాల విస్తీర్ణంలో గల సుమారు 435 మంది రైతులకు సంబంధించి అసైన్డ్ భూములను సందర్శించి సంబంధిత రైతులను విచారించేందుకు గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై శ్రీనివాసరావు పర్యవేక్షణలో బృందాలు పర్యవేక్షించారు.నాతవరం తహసిల్దార్ వాసు, నర్సీపట్నం తహసిల్దారు రవికుమార్ సహ వివిధ మండలాలకు చెందిన నలుగురు డిటిలు, పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు మండలానికి ఆరు బృదాలుగా ఏర్పడి శుక్ర, శని ,ఆదివారాల్లో రికార్డులను భూములను పరిశీలించనున్నారు. 2023 కంటే ముందు పట్టాలు తీసుకున్న భూములను ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందించినట్లు డిటి అన్నాజీరావు తెలిపారు. మండలంలో పాములవాక, బోడపాలెం, చిన్న బొడ్డేపల్లి, పీకే పల్లి, కె.వి పురం, అన్నవరం లింగాపురం, ఎండపల్లి ,జల్లూరు, తంగేడు, కోటవరట్ల, చౌడువాడ, ఆర్సి పాలెం, కైలాస పట్నం ,రాజుపేట, జగ్గంపేట ,గొట్టువాడ, గ్రామాలలో 22ఎ ఫ్రీ హెూల్డ్ భూములను క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నారు ఆయా ప్రాంత రైతులు సహకరించాలని రెవిన్యూ సిబ్బంది కోరారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ జయరాం

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దు

ప్రజాశక్తి- కోటవురట్ల:నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ అధికారి జయరాం తహసిల్దార్ కార్యాలయాన్నిశుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు.కార్యాలయానికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పనిచేసే గదిలోకి వెళ్లి ఫిర్యాదుల పెట్టె, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు పెండింగ్ సమస్యలు, ఫిర్యాదుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపై సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జానకమ్మ, ఉప తహసిల్దార్ అన్నాజీరావు, ఆర్ఐ ఊర్ధవరావు, పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అమ్మపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యాంకుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బీజేవీ.ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మపేట గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అంజేశారు. అనంతరం గ్రామస్థులకు ఆరోగ్య సూత్రాలు వివరించి వాటిని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సాకిని, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరరావు, ఏఎన్ఎం మహాలక్ష్మీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలంటీర్లకు న్యాయం చేస్తాం

-హోం మంత్రి అనిత



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి: గత ప్రభుత్వం గ్రామ వాలంటీర్లను 2023 తర్వాత రెన్యువల్ చేయలేదని, ఈ విషయంపై క్యాబినెట్‌లో చర్చ జరిగిందని, త్వరలోనే గ్రామ వాలంటీర్లకు న్యాయం చేస్తామని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలిపించారని, అభివృద్ధి చేసి చూపిస్తానని, అలాగు గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకు వస్తున్నామని తెలిపారు. పాయకరావుపేటలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు గతంలో ఫించను విషయంలో వృద్ధులను రోడ్లపై నిలబెట్టారని, వాలంటీర్ లేకపోతే ఫించన్లు పంపిణి చేయలేమనే భావనలో గతంలో అధికారులు ఉన్నారన్నారు. ఇప్పుడు సచివాలయం సిబ్బంది ఒక్కరోజులో 90 శాతం ఫించన్లు ఇస్తున్నారని, ఆదివారం సెలవు వస్తే,శనివారమే ఫించన్ పంపిణి చేసారని గుర్తుచేశారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ ను రద్దు చేయడమే కాకుండా పోలవరం ప్రాజెక్ట్ కు అత్యధిక నిధులు తీసుకువచ్చిన ఘనత ఎన్డియే కూటమిది అన్నారు. పాయకరావుపేట మేజర్ పంచాయితీకి అన్నా క్యాంటీన్ మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామి ఇచ్చారన్నారు.ప్రతీ గ్రామంలో సమస్యలు పరిష్కరించే దిశగా,గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, సోమవారం ఫిర్యాదుల బాక్స్ లు ప్రారంభిస్తామని తెలిపారు. ఎన్డియే కూటమి ప్రభుత్వం వందరోజులు పూరైన సందర్భంగా నక్కపల్లి మండలం లో క్రిష్ టౌన్ షిప్‌లో ఆమె స్వగృహం వద్ద కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు.రానున్న రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

అధికారులతో అనిత సమీక్ష

నక్కపల్లి:పాయకరావుపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో హెూం మంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు .రెవెన్యూ ,పంచాయతీరాజ్ ,గ్రామీణ నీటి పారుదల శాఖ ,వివిధ శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు. డ్రైనేజీలు, శ్మశాన వాటికలు ,కల్వర్టలు, రోడ్ల త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. వెంకటనగరం,రాజానగరం తుఫాను రక్షిత భవనాలు మరమత్తులు చేయాలని సూచించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ,పోలీస్ అధికారులకు ఆదేశించారు.



విడుదలవుతున్న నీరు

కల్యాణపులోవ నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కల్యాణపు లోవ (వరహా) జలాశయం ప్రస్తుతం నీటిమట్టం 458.90 అడుగులకు చేరిందని జలాశయం ఏఈ సత్యనారాయణదొర చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులకు తెలిపిన వివరాలు మేరకు... జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 460.00 అడుగు లు కాగా ప్రస్తుతం ఇన్ ఫ్లో 50 క్యూసెక్కుల వరద నీరు చేరుతుందని శుక్రవారం సాయంత్రానికి స్పిల్ వే ద్వారా ముందుగా రెండు గేట్లు ఎత్తి 100 క్యూ సెక్కుల నీటిని సర్పా నదిలోనికి విడుదల చేస్తున్నట్టు తెలిపారు. జలాశయం పరివాహక ప్రాంతంలో ఇన్ ఫ్లో పెరిగే కొద్ది మిగిలిన గేట్ల ద్వారా దిగువకు (నది)లోనికి వరద నీటిని విడుదల చేస్తామన్నారు. సర్పానదీ పరీవాహక ప్రాంతంలో ఉన్నా గ్రామ ప్రజలను అప్రమత్తం చేయవలసినదిగా రెవెన్యూ అధికారులకు సమాచారం అందించామని పేర్కొన్నారు.



విజేతగా నిలిచిన మౌనిక

నేషనల్ బాక్సింగ్ పోటీల్లో మౌనిక ప్రతిభ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: గౌహతిలో శుక్రవారం జరిగిన యూత్ సీనియర్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో నర్సీపట్నంకు చెందిన బాక్సర్ బొంతు మౌనిక విజేతగా నిలిచారు. 80 కేజీల విభాగంలో సెమీ ఫైనల్స్‌లో ఆర్ఎస్‌సి ఫస్ట్ రౌండ్‌లో బౌట్ మణిపూర్ పై గెలిచి విజేతగా నిలిచి ఫైనల్స్‌కు చేరింది. పంజాబ్ బాక్సర్‌తో ఫైనల్‌లో గెలిస్తే స్వర్ణ పతకం గెలుపొందనుంది. ఈ సందర్భంగా మౌనికను పలువురు అభినందించారు.



సందడి చేస్తున్న చిత్ర యూనిట్, అభిమానులు

సందడిగా మన్యం ధీరుడు విడుదల

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:మన్యం వీరుడు చిత్రం విడుదల శుక్రవారం వెంకటేశ్వర థియేటర్ లో విడుదల అయ్యింది. ఈ సందర్భంగా బాణాసంచాతో, కోలాటాలతో సందడి చేశారు. విద్యార్థులు, యువత మన్యం ధీరుడు చిత్రాన్ని తప్పక చూడాలని, దేశభక్తిని రగిలించే మన్యం ధీరుడు చిత్రం వీక్షణం ఒక చారిత్రక అవసరం అని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి రామ్ అన్నారు. ఆర్.వి.వి సత్యనారాయణ నిర్మాతగా ఉంటూ, హీరోగా నటించిన మన్యం ధీరుడు చిత్రంలో నటించారన్నారు. బ్రిటిష్ వారి గుండెల్లో సింహమై నిలిచిన అల్లూరి సీతారామరాజు జీవిత కథ ఆధారంగా నిర్మించిన ఈ చిత్రం ప్రతి ప్రేక్షకుడిలో దేశభక్తి కాంక్షను రగిలిస్తుందన్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారు మన్యం ధీరుడు చిత్రాన్ని చాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత హీరో ఆర్‌వివి సత్యనారాయణ, దర్శకుడు నరేష్ డెక్కల పాల్గొని చిత్రాన్ని వీక్షించారు.

పలు ప్రాంతాల్లో భారీ వర్షం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. కేడిపేట, లింగంపేట, చోద్యం, కొంగసింగి, సిహెచ్.నాగాపురం, కొత్తమల్లంపేట తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో రహదారులు జలమయం అయ్యాయి.



కురుస్తున్న వర్షం

భూదాన్ భూముల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్:భూదాన్ భూముల సంరక్షణకు నడుం బిగించినట్టు ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ చైర్మన్ ఎన్.రాంబాబు నాయుడు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 2000 ఎకరాలకుపైగా భూదాన భూములు ఉన్నాయని తెలిపారు. వీటిలో సర్వే నెంబరు 132లోని 50.56 ఎకరాల భూదాన్ యజ్ఞ బోర్డుకు చెందిన భూమిని అన్యాక్రాంతం కాకుండా సంరక్షించే చర్యలు చేపట్టామన్నారు. నాడు ఆచార్య వినోబాభావే భూదాన్ ఉద్యమాన్ని ప్రస్తావించారు. సమావేశంలో తెలంగాణ భూదాన బోర్డు చైర్మన్ ఆర్.శంకర్ నాయక్, ఎపి ప్రధాన కార్యదర్శి డి దీనబంధు, ఉపాధ్యక్షురాలు వల్లూరి లత, కార్యనిర్వాహక కార్యదర్శులు రవికుమార్, జి.ప్రదీప్ దాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ దివ్య

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎడ్ల బళ్ల, ట్రాక్టర్లపై ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కేడిపేట ఎస్సై టి.దివ్య హెచ్చరించారు. శుక్రవారం లింగంపేట, చోద్యం, కృష్ణదేవిపేట నాటుబళ్ళ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కేడిపేటలో బెల్ట్ షాపులపై దాడులు చేసి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

-నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:విద్యార్థి దశ నుండే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుని లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రచించుకొని ముందుకు సాగాలని, గమ్యం చేరే సమయంలో, కాంపిటేటివ్ పరీక్షల్లో ఒడిదొడుకులు సహజమని ఒత్తిళ్లకు లోనవ్వకుండా ఒడిదుడుకులు తట్టుకొని ముందుకు సాగాలని విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంక బ్రతా బాగ్చి చెప్పారు.శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శ్రీ నవోదయ జూనియర్ కాలేజీ అద్భుత్హ పేరిట నిర్వహించిన కాలేజీ ఫెస్ట్ కు అయన ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, సమాజంలో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను గౌరవించే విధంగా నడుచుకోవాలన్నారు. సెల్‌ఫోన్ వాడకం తగ్గించి సత్ప్రవర్తనతో కూడి ఉండాలని సూచించారు.సామజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా ఉండాలని కోరారు. విద్యార్థులు చదువును బలవంతంగా భావించకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.



సిపిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ప్రముఖ మోటివేటర్ షేక్ అన్వర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ ప్రతిభ, సృజనాత్మకతలకు మెరుగుపెడుతూ, తల్లితండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. శ్రీ నవోదయ జూనియర్ కాలేజ్ సెక్రటరీ, కరెస్పాండంట్ డాక్టర్ బిఆర్ఎస్ నారాయణ మాట్లాడుతూ, తమ సంస్థలో ప్రతి విద్యార్థికి ఎటువంటి ఒత్తిడి లేకుండా నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ నవోదయ జూనియర్ కాలేజ్ డీన్ భీశెట్టి మురళి ప్రకాష్,డైరెక్టర్ విశ్వ కీర్తి, ప్రిన్సిపాల్ మైకేల్ జాన్ పాల్గొన్నారు.